ఐదు పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

జీడిమెట్ల, జూన్ 20 : ఒకే రోజు ఐదు పుణ్య క్షేత్రాలను సందర్శించాలనుకునే భక్తులకు ఆర్టీసీ ఈనెల 27 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ అమ్మవారి ఆలయం, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయం, పురాతన శివాలయాలు, మంత్రాలయం రాఘవేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు దర్శించుకునేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈనెల 27న ఉదయం 5 గంటలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభమై తిరిగి రాత్రి 11 గంటలకు దుండిగల్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. దుండిగల్ నుంచి గండిమైసమ్మ, షాపూర్‌నగర్, చింతల్, జగద్గిరిగుట్ట, బాలానగర్, జేబీఎస్ మీదుగా బస్సు సర్వీసులు కొనసాగుతాయన్నారు. బుకింగ్,ఇతర వివరాల కోసం 9959226150, 9959615886 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి కావాలి

మేడ్చల్, జూన్ 20: ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి కావాలని కలెక్టర్ మనూచౌదరి జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాకు మంజూరైన 1,409 ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ కోసం గృహ నిర్మాణశాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇప్పటి వరకు 516 ఇండ్లు మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని, ఇంకా 900 ఇండ్ల గ్రౌండింగ్ కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కలెక్టర్‌కు వివరించారు. ఏఈలు ఒక్కొక్కరికీ 125ఇండ్ల చొప్పున పూర్తి చేయాలని ఆదేశించారు.

కుత్బుల్లాపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, జూన్ 20: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ ఒక్షిత హిల్ వ్యూ కాలనీలో రూ. 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. శివారు ప్రాంతాల్లో రోజురోజుకు పెరుగుతున్న కొత్త కాలనీల్లో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం ఒక్షిత హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు సి.నాగరాజు, అడ్వైజర్ ఎం. సురేంద్ర, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ బాయ్, సీనియర్ నాయకులు తెలంగాణ సాయి, మూసాఖాన్, వెంకటేశ్, చందు, మహేశ్, చిన్నా చౌదరి, బాబీచౌదరి, దూలప్ప, సమ్మయ్య యాదవ్, రాములుగౌడ్, కరుణాకర్ రాజు, శివానాయక్, జునైద్, ప్రసాద్, గౌస్, వాహిద్, మహిళా అధ్యక్షురాలు సంధ్య పాల్గొన్నారు.

కైసర్‌నగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కైసర్ నగర్‌లో పర్యటన

గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామన్నారు. కైసర్‌నగర్ ప్రాంతంలో ప్రతి గల్లీలో ఇంటింటికీ తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజ్ సదుపాయం కల్పించడంతోపాటు ప్రధాన రహదారిని అభివృద్ధి పరిచామన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ మల్లారెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం మాధవి, ఈఈ కిష్టప్ప, వివిధ విభాగాల అధికారులతోపాటు బీఆర్ఎస్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతులు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్,జూన్ 20: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అంతేకాకుండా శుభకార్యాలు, వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చర్లపల్లి, జూన్ 20: ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లకు కుషాయిగూడ ఏసీపీ వై.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, అక్రమ పార్కింగ్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చక్రీపురం ప్రధాన రహదారిపై అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, లారీలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లారీలను రోడ్డుపై నిలుపకుండా ప్రమాద రహిత జోన్‌గా తీర్చిదిద్దడంలో యజమానులు, డ్రైవర్లు భాగస్వాములు కావాలని సూచించారు. లారీ డ్రైవర్లు, వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామ్‌లక్ష్మణ్, చర్లపల్లి, కుషాయిగూడ ఎస్సైలు, ట్రాఫిక్ ఎస్సైలు, పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్క్ విల్లా అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

పార్క్ విల్లా కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నరసింహయాదవ్, అధికారులు

బాలానగర్, జూన్ 20: పార్కు విల్లా కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పార్కు విల్లా, అబ్రార్‌నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, తాగునీటి సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్, ఏఈ ఆశ, తేజ, శ్రీకాంత్, లక్ష్మణ్, రమేశ్, ప్రవీణ్, గణేశ్, రాజు, శ్రీనివాస్‌గౌడ్,యాదగిరి, విష్ణు, యూ సుఫ్, ఖాదర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

108 ఈఎంటీ కుటుంబానికి రూ.5 లక్షలు సాయం

శామీర్‌పేట, జూన్ 20 : 108 సిబ్బంది కుటుంబాలకు సంస్థ అండదండగా ఉంటుందని సంస్థ రాష్ట్ర హెచ్ఆర్ హెడ్ బి.కిరణ్‌కిశోర్ అన్నారు. మేడ్చల్ జిల్లా 108 ప్రాజెక్ట్‌లో జిల్లా 108 సమన్వయ కర్త (ఈఎంటీ) విధులు నిర్వహిస్తు అవుదాపురం విజేందర్ మే 11న అనారోగ్యంతో మరణించాడు. ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ సంస్థ నుంచి బాధిత కుటుంబాలకు కంపెనీ రూ.5 లక్షలు అందజేస్తుందన్నారు. అందులో భాగంగానే విజేందర్ కుటుంబానికి చెక్కును అందజేశామని తెలిపారు.

రుణ లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయం

కిసాన్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్‌బీఐ ఎల్‌డీవో దేబోజిత్ బారువా తదితరులు

మేడ్చల్ : గత ఆర్థిక సంవత్సరంలో రుణ వితరణ లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమని అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్‌బీఐ ఎల్‌డీవో దేబోజిత్ బారువా, నాబార్డు డీడీఎం అఖిల్ పున్నా అన్నారు. శుక్రవారం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యంలో 163 శాతం సాధించడం అభినందనీయమన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కెనరా బ్యాంక్ జిల్లా కోఆర్డినేటర్ మనోజ్ మీనా, డీఆర్‌డీవో సాంబశివ రావు, పీవోలు లత, ప్రభాకర్, డీఐసీ ఈఈకే రఘునాథ్, పీఎంఎఫ్ఎంఈ పీవో అమర్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రిపూట దొంగలు హల్‌చల్!

- డి.పోచంపల్లి, గండి మైసమ్మ ప్రాంతాల్లో చోరీలు
- భయాందోళనలో ప్రజలు
- పోలీసులు గస్తీ పెంచాలని వేడుకోలు



సీసీ కెమెరాలో రికార్డయిన చోరీ దృశ్యం

దుండిగల్,జూన్ 20: దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డి.పోచంపల్లి, గండి మైసమ్మ పరిసర ప్రాంతాల్లో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. రాత్రిపూట తాళం వేసిన ఇండ్లు, ప్రైవేటు కార్యాలయాలను టార్గెట్‌గా చేసుకుని తలుపులు బద్దలు కొట్టి మరీ చోరీలకు పాల్పడుతున్నారు. గత నాలుగు రోజుల్లో మూడు దొంగతనాలు జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాజరాజేశ్వర కాలనీలో గత మూడు రోజుల్లోనే రెండు చోరీ చోటుచేసుకున్నాయి. కాలనీలోని ఓ కార్యాలయంలో ఒంటిపై చెడ్డీ మాత్రమే ధరించిన దొంగలు రాత్రిపూట చొరబడి, తలుపులు విరగ్గొట్టి అందులోని కంప్యూటర్, హార్డ్ డిస్క్, బ్యాటరీలు అపహరించినట్లు బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు పేర్కొంటున్నారు. మరోవైపు ఈ రోడ్డులో పార్కింగ్ చేసిన ప్రైవేట్ స్కూల్ బస్సుల బ్యాటరీ సైతం దొంగతనానికి గురయ్యాయని పేర్కొంటున్నారు. ఇక గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని రెక్కీ నిర్వహించి మరి తస్కరించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, తక్షణమే స్పందించి దొంగల బారి నుంచి తమను కాపాడాలని బస్తీ వాసులు పోలీసులను కోరుతున్నారు. ఈ విషయమై దుండిగల్ సీఐ సతీశ్ మాట్లాడుతూ రెండు కేసులకు సంబంధించి ఫిర్యాదులు అందాయన్నారు. ఇప్పటికే కొందరు నిందితులను అరెస్టు చేశామన్నారు. మిగిలిన కేసుల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేసి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పేర్కొన్నారు.

'అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి'

రోడామేస్త్రీ నగర్ బీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ

జీడిమెట్ల, జూన్ 20 : అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని రోడామేస్త్రీనగర్ బీలో రూ.22 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత నెలలో పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మేరకు రోడ్డు పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ అశోక్, ఎన్ఏసీ ఏఈ నాగరాజు, సీనియర్ నాయకులు శేఖర్‌రావు, బస్వరాజు, షఫీ, షబ్బీర్, ఇస్మాయిల్, వాహబ్, నయీమ్, యూసఫ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 20: కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని రెండున్నర ఎకరాల స్థలంలో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కాలనీలో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రెండున్నర ఎకరాల హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాన్ని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో కాలనీ 9వ ఫేజ్‌కు అప్పగించారని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాలనీ ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్ఎండీఏ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఈ జీవన్‌రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గణేశ్ విగ్రహం ధ్వంసం

- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

దుండిగల్, జూన్ 20: పూటుగా మద్యం సేవించిన ఓ యువకుడు మత్తులో మండపంలోని గణేశ్ ప్రతిమను ధ్వంసం చేసిండు. ఉదయం గమనించిన స్థానికులు, భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఆందోళనకు దిగడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన కిశోర్(30) మూసాపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. కిశోర్‌కు వివాహం కాకపోవడంతో పాటు కుటుంబ సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో మద్యానికి అలవాటుపడ్డాడు. గురువారం అర్ధరాత్రి కిశోర్ బాచుపల్లి పరిధి సాయి నగర్ సమీపంలో ఖాళీ ప్రదేశానికి మద్యం సేవించేందుకు కారులో చేరుకున్నాడు. పీకలదాకా తాగి పక్కనే ఉన్న వినాయక మండపంలోని గణేశ్ విగ్రహాన్ని రాయితో కొట్టడంతో స్వల్పంగా ధ్వంసమైంది. అనంతరం కిశోర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత గమనించిన భక్తులు, స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నిందితుడిని శిక్షించాలని కొద్దిసేపు ఆందోళనకు దిగారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు సాయంత్రంలోగా అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి కారును సీజ్ చేశారు.

అనారోగ్యంతో ఏఎంసీ మృతి

నివాళులర్పిస్తున్న చందానగర్ సర్కిల్ ఉద్యోగులు

మియాపూర్ జూన్ 20: చందానగర్ సర్కిల్ పన్ను విభాగం ఏఎంసీ మహేందర్‌రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ధనాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మహేందర్‌రెడ్డి మృతి పట్ల చందానగర్ సర్కిల్ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ కృష్ణ విజయ్ సహ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 20: కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 21,వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 21, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యారెట్ 40, కాలీ ఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 55, గోరుచిక్కుడు 37, బీట్‌రూట్ 23, క్యాప్సికం 60, ఆలుగడ్డ 24, కీర 23, దోసకాయ 15, సొరకాయ 15, పొట్లకాయ 23, కందగడ్డ 45, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 24, చింతకాయ –, మామిడికాయ(1)15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 28, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 24 నుంచి 30, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని.., పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70 రూపాయలుగా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

'రోడ్లకు ఇరువైపులా గుంతలు పూడ్చాలి'

రామంతాపూర్ : బోనాలను పురస్కరించుకొని రోడ్లకు ఇరువైపులా గుంతలను పూడ్చాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ పర్యటించారు.

నిధులు కేటాయించినా పనులు చేయరా?

- రంగధాముని చెరువు సుందరీకరణను పట్టించుకోని అధికారులపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం

బాలాజీనగర్‌లో అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పాల్గొన్న కార్పొరేటర్ శిరీషాబాబురావు

కేపీహెచ్‌బీ కాలనీ,జూన్ 20: కూకట్‌పల్లి రంగధాముని(ఐడియల్) చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించినప్పటికీ... పనులెందుకు చేయడంలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా శుక్రవారం బాలాజీ నగర్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబురావు అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం వివేక్‌నగర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాముని చెరువు సుందరీకరణలో అవసరమైతే హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని సేకరించి... ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. చెరువు పరిసరాలు కబ్జా అవుతున్న ప్రదేశాలను గుర్తించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు ప్రాంగణంలో బతుకమ్మ కుంటను నిర్మించాలని ఆదేశించారు. రంగదామని చెరువు సుందరీకరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించి పనులను చేపట్టిందని, కొంత ప్రాంతాన్ని సుందరీకరించగా.. మిగిలిన ప్రాంతంలో పనులు ఎందుకు చేపట్టడం లేదని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి..

డివిజన్ పరిధిలోని శక్తినగర్, హబీబ్‌నగర్, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్–1వద్ద బైన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సేవాలాల్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు బాలాజీ నగర్‌లో నూతన ధోబీఘాట్ నిర్మాణం కోసం ప్రణాళికల సిద్ధం చేయాలన్నారు. వీధి దీపాల సమస్యను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నిధుల కొరత ఉంటే తనకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ఆయా విభాగాల అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉన్నారు.

రోడ్డును ఆక్రమించి బాత్‌రూమ్ నిర్మించిండు!

- మున్సిపాలిటీ కార్యాలయంలో స్థానికుల ఫిర్యాదు
- కొంపల్లి గాంధీనగర్‌లో మాజీ కార్పొరేటర్ భర్త దౌర్జన్యం

గాంధీనగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన వాష్‌రూమ్

కుత్బుల్లాపూర్, జూన్ 20: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌లో బీజేపీకి చెందిన మాజీ కౌన్సిలర్ భర్త దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించి బాత్‌రూమ్ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై శుక్రవారం స్థానికుడు బాలరాజు గుప్తాతో పాటు మరికొందరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా స్థానిక మాజీ కౌన్సిలర్ భర్త దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించి వాష్‌రూమ్ నిర్మాణం చేపట్టాడన్నారు. దాంతో కాలనీవాసులతోపాటు పక్కన ఉండే వారికి తీవ్ర ఇబ్బంది అవుతుందన్నారు.

దీనిపై సదరు వ్యక్తిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి ఉసిగొల్పుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్, ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చేపట్టి నిర్మాణాన్ని తొలగించాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మాదాపూర్, జూన్ 20: ఫీడర్ మరమతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆల్విన్ ఫీడర్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్, మదీనగూడ ఏరియా, మదీనగూడ విలేజ్ పార్ట్‌లో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు, 11 కేవీ గణేశ్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని మార్తాండనగర్, న్యూ హాఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 11 కేవీ గోల్డెన్ తులిప్ ఫీడర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 11 కేవీ ప్రేమనగర్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్, న్యూ హాఫీజ్‌పేట, ప్రేమ్‌నగర్ బి బ్లాక్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ మార్కెట్ ఫీడర్ పరిధిలోని సీఎం తోట, శిల్పకళా గార్డెన్ ఏరియా, వెంకటేశ్వరనగర్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జీడిమెట్ల పరిధిలో..

జీడిమెట్ల : మరమ్మతుల కారణంగా 11 కేవీ భాగ్యలక్ష్మీ కాలనీ ఫీడర్ పరిధిలోని జీడిమెట్ల సబ్‌స్టేషన్–4 నుంచి శనివారం ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జీడిమెట్ల ఏఈ ప్రసూన తెలిపారు. భాగ్యలక్ష్మీ కాలనీ, 11 కేవీ యూఎస్పీ ఆర్గానిక్స్ ఫీడర్ పరిధి జీడిమెట్ల సబ్‌స్టేషన్–3 పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 వరకు ఎస్వీసీఐఈ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో..

కేపీహెచ్‌బీ కాలనీ : విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బాలాజీ నగర్ ఏఈ భీమలింగప్ప తెలిపారు శనివారం ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు బాలాజీనగర్, వివేక్ నగర్, పీపుల్స్ వైద్యశాల పరిసర ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు హబీబ్‌నగర్, మజీద్, పవర్‌నగర్ పార్క్, ప్రగతి నగర్ పార్క్, వసుంధర వైద్యశాల ఏరియా, 3.30 నుంచి 4 గంటల వరకు మూసాపేట్ వార్డ్ ఆఫీస్, గూడ్స్‌షెడ్ రోడ్, శివశక్తి నగర్,4 నుంచి 4.30 గంటల వరకు పుల్లారెడ్డి కాంపౌండ్, సేవాలాల్‌నగర్, మెజెస్టిక్ విల్లా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చెత్తబుట్ట అందజేత

అల్లాపూర్,జూన్ 20: ఇస్కాన్ దేవాలయానికి శుక్రవారం రాఘవమ్మ ఇంటిగ్రేటెడ్ ఎవల్యూషన్ డ్రైవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్రనాథ్ ఠాగూర్ చెత్త బుట్ట, ప్రసాదానికి అవసరమైన చేతి సంచులతోపాటు నగదును సైతం అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

శామీర్‌పేట : సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ మజీద్‌పూర్‌కు చెందిన ఆనంద్‌గౌడ్ వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దాంతో ఆయనకు మంజూరైన రూ. 31,500 చెక్కును శుక్రవారం లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public are hereby notified that, my client, Sri. P.V.Sharath Kumar, S/o P.V.S. Suryanarayana, has entered into an Agreement of Sale with Sri. Mallikharjuna Reddy Madam Venkata Naga, S/o. Yerukula Reddy (Vendor), for the purchase of Villa i.e., H.No.2-23-1/HS-1/VILLA No.8 (PTIN No.1140213949), in Ramky Pearl, adm.275.00 Sq.yds., [3000 Sft- Ground, First & Second Floor (Triplex)], in Sy.Nos.143 to 147 & 149 to 156, at HMT Sathavahana Nagar, Kukatpally, Balanagar (M), Medchal-Malkajgiri Dist, and bounded by: **North:** Boundary wall, **South:** Villa No. HS-2/Villa No.07, **East:** Park, **West:** 12 feet Road. He acquired title under Sale Deed No.2191/2012, dt.04-04-2012, regd. at SRO-Kukatpally, from land owners Sri K.Mohan & 69 others, rep. by their ASGPA Holder Godavari Developers (vide ASGPA Doc No.7292, 7293, 7294, 7295, 7296 & 7297 of 2005, dt.19.9.2005) & Ramky Estates & Farms Ltd.,[Developer].

Any person having claims or objections must submit supporting documents to the undersigned within 15 days of publication either personally or through their counsel, failing which the sale will proceed and no claims will be entertained thereafter.

Sd/- K. Santosh Kumar,
Advocate
3-11-4,Gokhale Nagar,
Ramanthapur, Hyd-13
Ph:8332839999

Date: 20-06-2025